విద్యుత్‌శాఖపై బకాయిల బండ

- పేరుకుపోతున్న ప్రభుత్వ శాఖల బిల్లులు
- కావలి విద్యుత్ డివిజన్‌లో రూ.5.46కోట్ల బకాయిలు



కావలిలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం

కావలి: విద్యుత్‌శాఖ కావలి డివిజన్ పరిధిలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేయడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. ఫలితంగా బకాయిలు క్రమంగా పేరుకుపోతూ తడిసిమోపడవుతున్నాయి.

డిసెంబర్ నాటికి రూ.5.46కోట్ల బకాయిలు

కావలి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు డిసెంబర్ నాటికి రూ.5.46కోట్లు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు సంబంధించి మూడు నెలలకోసారి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. అయితే నిధుల కొరత కారణంగా సకాలంలో విడుదల చేయడం లేదు. దీంతో సకాలంలో బిల్లులను చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. ఫలితంగా విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. కావలి డివిజన్ పరిధిలో ప్రధానంగా పోలీస్ స్టేషన్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలకు సంబంధించిన బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు నిధులు అంతంత మాత్రంగా వస్తుండడంతో వీధిదీపాలు, మంచినీటి పథకాలకు సంబంధించిన బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. రెవెన్యూ శాఖలో భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఆదాయం కూడా బాగానే వస్తోంది. అయినా ఈ శాఖ కూడా బకాయి భారీగా ఉండడం గమనార్హం. విద్యుత్‌శాఖ బిల్లుల బకాయిల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రీపెయిడ్ మీటర్లను తీసుకొస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసింది. అయితే అవి సాంకేతికంగా పని చేయడం ఇంకా మొదలు కాలేదు. ఆ మీటర్లు పని చేయడం మొదలైతే విద్యుత్ శాఖకు ప్రభుత్వ కార్యాలయాల బకాయిల బెడద శాశ్వతంగా తొలగిపోతుంది.

శాఖల వారీగా బకాయిలు
రూపాయల్లో..

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు	13,45,167
పశుసంవర్థక, మత్స్య శాఖలు	7,38,448
బీసీ సంక్షేమ శాఖ	13,56,848
అటవీ శాఖ	1,51,927
గ్రామ/వార్డు సచివాలయాలు	19,84,314
ఆరోగ్య శాఖ	33,38,539
పోలీసు శాఖ	17,46,584
గృహ నిర్మాణ శాఖ	1,08,109
విద్యా శాఖ	1,15,40,221
పరిశ్రమ శాఖ	10,76,350
న్యాయ శాఖ	75,731
మున్సిపల్ శాఖ	19,47,117
పంచాయతీ రాజ్ శాఖ	46,74,170
రెవెన్యూ శాఖ	71,06,751
గ్రామీణాభివృద్ధి శాఖ	1,01,74,964
గిరిజన సంక్షేమ శాఖ	30,03,704
రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖలు	8,34,234
ఇరిగేషన్ శాఖ	25,83,669
స్త్రీ, శిశు సంక్షేమ శాఖ	6,50,063
టూరిజం శాఖ	1,64,261

క్లుప్తంగా

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా నున్నా సంతోష్



ఆత్మకూరురూరల్: బీజేపీ పట్టణాధ్యక్షుడిగా నున్నా సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆత్మకూరులో పార్టీ నాయకుడు బచ్చల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో సంతోష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా నూతన అధ్యక్షుడికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నలుగురి జూదరుల అరెస్ట్

కావలి: మండలంలోని కొండయ్యగారిపాళెంలో పోలేరమ్మగుడి సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను కావలి రూరల్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి తన సిబ్బందితో పేకాట, కోడిపందేల స్థావరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొండయ్యగారిపాళెంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రూ.1280 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుమలరెడ్డి తెలిపారు.

మినీగోకులాలను త్వరగా పూర్తి చేయాలి

వరికుంటపాడు: కలెక్టర్ ఆదేశాల మేరకు మినీ గోకులాల నిర్మాణ పనులను లబ్ధిదారులు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి పశు వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలానికి ఆరు పశువుల సామర్థ్యం కలిగిన 25మినీగోకులాలు మంజూరుకాగా, 22 మంది నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొచ్చారని తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ.2.30 లక్షలు కాగా, అందులో లబ్ధిదారుల వాటా రూ.23వేలు, ప్రభుత్వం వాట రూ.2.07లక్షలు అని తెలిపారు. నెలాఖరులోగా లబ్ధిదారులు నిర్మాణాలను పూర్తిచేస్తే ప్రభుత్వం నగదు మంజూరు చేస్తుందని వివరించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

వరికుంటపాడు: మండలంలోని పామూరుపల్లెలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

పింఛన్ల పంపిణీ రేపు

అల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల 31న నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీ ఆప్షనల్ హాలిడే కావడంతో 31న పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ల వద్ద ఉండి పింఛన్లు తీసుకోవాలని సూచించారు. ఆ రోజు తీసుకోని వారికి 2,3 తేదీల్లో పంపిణీ చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాద ప్రాంతాల పరిశీలన



సంగం: మండలంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను ఎస్సై రాజేష్‌తో కలిసి ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఆదివారం రాత్రి పరిశీలించారు. ప్రమాదాలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ నడిపే వారు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టులు విధిగా ధరించాలని సూచించారు. మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డుభద్రతా నిబంధనలను పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సంగం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సూచించారు. మండలంలోని మర్రిపాడు గ్రామంలో పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే తమకు సమాచారం అందజేయాలని కోరారు. మత్తు పదార్థాలు, జూదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దని సూచించారు.

గిరిజనులకు దుప్పట్ల వితరణ



సంగం: మండల కేంద్రమైన సంగానికి చెందిన విద్యార్థులు హిమరవిశంకర్, నిఖిల్, రిషి, మహిధర్ తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో సంగంలో పెన్నానది సమీపంలో ఉన్న గిరిజన కాలనీలోని 50 గిరిజన కుటుంబాలకు ఆదివారం దుప్పట్లు వితరణ చేశారు. వివేకానందుని స్ఫూర్తితో గిరిజనులకు దుప్పట్లు వితరణ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేజర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జనవరి 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

సంగమేశ్వరుడికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చనకు బిల్వపత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చనను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గణపతిపూజ, స్వస్తి వాచకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చిన బిల్వపత్రాలతో వేద పండితులు అర్చనను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

క్విజ్ పోటీలు విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంచుతాయి



దుత్తలూరు: విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందించేందుకు క్విజ్ పోటీలు దోహదపడుతాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి అన్నారు. స్థానిక సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డబ్ల్యూఆర్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా సీడ్స్ సంస్థ జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో సీడ్స్ సంస్థను నెలకొల్పి విద్య, వ్యవసాయ, సాంకేతిక రంగాల్లో గ్రామీణులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సీడ్స్ వ్యవస్థాపకుడు విశ్రాంత ఏఏఎస్ అధికారి చంద్రమౌళీశ్వర రెడ్డిని అభినందించారు. అనంతరం ఆయన్ని సీడ్స్ సంస్థ సిబ్బంది శాలువాతో సన్మానించారు.

విజేతలు వీరే..

జిల్లాలోని 35 మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనగా జలదంకి మండలం బ్రాహ్మణక్రాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.20వేలు నగదును అందుకున్నారు. అలాగే సంగం, సీతారామపురం మండలం బసినేనిపల్లె జెడ్పీహెచ్‌ఎస్, నెల్లూరులోని వైఎంసీఏ విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.15 వేలు, రూ.10 వేలు నగదును అందుకున్నారు. నెల్లూరుకు చెందిన వైఎంసీఏ విద్యార్థులు నాల్గో బహుమతి రూ.5 వేలు నగదును పొందారు. విశ్రాంత ఏఏఎస్ అధికారి ఆర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈఓ వెంగయ్య, సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పడకేసిన పల్లె వైద్యం

చేజర్ల: మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుధ్యం లోపించడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరపీడితులు పీహెచ్‌సీలకు పరుగులు తీస్తున్నారు. అయితే పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండకపోతుండడంతో వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో చిత్తలూరు, చేజర్లలో పీహెచ్‌సీలు ఉన్నాయి. చిత్తలూరు పీహెచ్‌సీకి నిత్యం 50కుపైగా ఓపీలు వస్తుంటాయి. అందులో జ్వరపీడితులు 5 నుంచి 7 మంది వరకు ఉంటున్నారు. చేజర్ల పీహెచ్‌సీకి నిత్యం 70 వరకు ఓపీలు వస్తుంటాయి. అందులో జ్వరాలు, డయేరియా కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. రెండు పీహెచ్‌సీలకు ఇద్దరు చొప్పున వైద్యులు ఉన్నారు. అయితే వైద్యులు సమయపాలన పాటించకపోతుండడంతో రోగులు ఇబ్బదులు పడుతున్నారు. చేజర్ల పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ అందుబాటులో ఉండడం లేదు. ఇటీవల మండలంలోని మడపల్లి, పాతపాడు గ్రామాలకు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 50 మంది వలస కూలీలు వరినాటేందుకు వచ్చారు. వాతావరణంలోని మార్పులతో జ్వరాలు, డయేరియా బారిన పడ్డారు. అయితే జ్వరాలు ప్రబలినప్పుడు వైద్య శిబిరం ఏర్పాటు చేయకుండా తగ్గిన తర్వాత పెట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పది రోజుల క్రితం గొల్లపల్లిలో జ్వరాలు ప్రబలడంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అయితే వైద్యులు ఎవరూ హాజరుకాకపోవడంతో వైద్యారోగ్య సిబ్బందే మందులు అందజేశారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి వైద్యసేవలు సక్రమంగా అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కుస్తీ పోటీల విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు



మహిళల కోలాట ప్రదర్శన

ఆత్మకూరు: పట్టణంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్, తెలుగుభారతి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం వేడుకగా నిర్వహించారు. పట్టణంలోని తూర్పువీధి అలఘునాథ స్వామి ఆలయ సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వేడుకలు జరిగాయి. తొలుత నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు, సేవా సమితి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పలువురు వక్తలు సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. అనంతరం మహిళలకు స్పూన్ అండ్ లెమన్, రంగవల్లులు, సూది–దారం, తదితర పోటీలను నిర్వహించారు. మహిళలు, బాలికలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అలాగే యువతకు కుస్తీ, కర్రసాము పోటీలు నిర్వహించారు.సాయంత్రం మహిళలకు కోలాటం పోటీలు జరిపారు. రాత్రి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



కర్రసాములో పోటీ పడుతున్న యువకులు



సోది చెప్పే ఎరుకలసాని

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మందికి తీవ్రగాయాలు



బోల్తా పడిన ఆటో



క్షతగాత్రురాలిని ఆస్పత్రికి 108లో తరలిస్తున్న దృశ్యం

సంగం: మండల పరిధిలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 11 మంది స్వల్ప గాయాలతో బయపడ్డారు. మండలంలోని చెన్నవరప్పాడుకు చెందిన 20 మంది కూలీలు ఆటోలో దువ్వూరు సమీపంలోని పొలాల్లోకి ఉదయం వరినాట్లకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఆటోలో ఇంటికెళ్తుండగా తరుణవాయి వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి ఆటోను బైక్ ఢీకొంది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్లీశ్వరి, తలమంచి శీనయ్య, కొండమ్మ, వాకాటి లక్ష్మమ్మ, గుంజి బుజ్జమ్మ, ఊరుటూరు బుజ్జమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

– దువ్వూరు వద్ద ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మౌలాలీ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే కొరిమెర్ల వద్ద మోటార్‌బైక్ అదుపుతప్పి చెన్నకేశవులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు.

అదుపుతప్పి కారు బోల్తా

సంగం: మండలంలోని దువ్వూరు సమీపంలో ఆదివారం రాత్రి ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులోని నలుగు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలు.. ఆత్మకూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు నలుగురు ప్రయాణికులతో వెళ్తున్న కారు దువ్వూరు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కాగా సమాచారం అందుకున్న సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని కారులోని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. కారులోని నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న పోలీసులు

విద్యుత్‌షాక్‌కు పాడి పశువులు బలి

- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- పరిహారం అందజేస్తున్న విద్యుత్ శాఖ
- అవగాహన లేక పరిహారానికి దూరం



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెలు (ఫైల్)

సంగం: రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను కొనసాగిస్తుంటారు. పాడి పశువులు ఉంటే కుటుంబం జరుగుతుందని వాటిని పోషిస్తుంటారు. అలాంటి కుటుంబ జీవనోపాధికి కీలకమైన పాడి పశువులు ఊహించని విధంగా విద్యుత్ ప్రమాదాలకు గురైతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్ తీగలు వేలాడడం, తెగిపడడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు లేకపోవడం, తదితర కారణాల వల్ల మూగజీవాలు విద్యుత్ షాక్ గురై మరణిస్తే విద్యుత్‌శాఖ పరిహారం అందజేస్తుంది. అయితే పాడి రైతులకు సరైన అవగాహన లేక పరిహారానికి దూరమవుతున్నారు.

ఆరు నెలల్లో 8 పశువులు మృత్యువాత

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదుకు పైగా విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో ఏడు గేదెలు, ఒక దూడ, ఒక ఎద్దు మరణించాయి. గత మే 17న ఏఎస్‌పేట మండలం చౌటభీమవరంలో విద్యుత్‌షాక్‌కు గురై గేదె మృతి చెందింది. అలాగే జూలై 15న అనంతసాగరం మండలం కచిరిదేవరాయపల్లిలో గేదె, సెప్టెంబర్ 29న చేజర్ల మండలం మడపల్లిలో గేదె, దూడ, అక్టోబర్ 1న మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో నాలుగు గేదెలు, అక్టోబరు 5న పొంగూరులో ఎద్దు మృత్యువాత పడ్డాయి.

దరఖాస్తు ఇలా...

విద్యుత్ షాక్‌తో మూగజీవాలు మృత్యువాత పడితే ముందుగా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు, వీఆర్వో, తహసీల్దార్‌కు సమాచారం అందజేయాలి. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. కేసు నమోదయ్యాక పశుకళేబరానికి పోస్టుమార్టం చేయించాలి. పశువైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. అనంతరం పరిహారం కోసం విద్యుత్‌శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం నివేదిక, బ్యాంక్ అకౌంట్, తదితర కాపీలను జత చేసి విద్యుత్‌శాఖ ఏఈకు దరఖాస్తు అందజేయాలి. ఏఈ ప్రాథమిక దర్యాప్తు చేసి దరఖాస్తుతో పాటు తన నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఈ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తరువాత నష్ట పరిహారాన్ని బాధితుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తారు. మృతి చెందిన పశువు విలువ ఆధారంగా, నిబంధనలను అనుసరించి పరిహారాన్ని లెక్కిస్తారు. ఈ మేరకు బాధిత రైతుకు నష్టపరిహారం దక్కుతుంది.

పోస్టుమార్టం తప్పనిసరి

విద్యుత్ షాక్‌తో పశువులు మరణిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేయాలి. ఎఫ్ఐఆర్ ఉంటే పశువైద్యాధికారి పోస్టుమార్టం చేస్తారు. ఆ నివేదికలో సంబంధిత పశువు మరణానికి విద్యుత్ షాక్ కారణమని తేలితే ఆ మేరకు నివేదిక అందజేస్తారు. ఆ రెండింటిని తీసుకెళ్లి విద్యుత్‌శాఖ అధికారులకు అందించాలి. వారి దర్యాప్తు చేసి పరిహారం అందజేస్తారు. –డాక్టర్ డీ శ్రుజని, పశువైద్యాధికారి, సంగం

అర్హులకు పరిహారం

ప్రమాదవశాత్తు లేదా ప్రకృతి విపత్తుల కారణంగా విద్యుత్ షాక్‌కు గురై పశువులు మరణిస్తే విద్యుత్‌శాఖ పరిహారం అందజేస్తుంది. ఇందుకోసం రైతులు పోలీసు ఎఫ్ఐఆర్ కాపీ, పశువైద్యుల పోస్టుమార్టం నివేదికతో విద్యుత్‌శాఖ ఏఈకు దరఖాస్తు చేసుకోవాలి. ఏఈ విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి నష్టపరిహారం అందజేస్తారు.

–ఉడతా మన్మథరావు, ఏఈ, సంగం